# బుద్ధం శరణం గచ్ఛామి

శ్రీ నాయుడు వెంకటసీతారామమూర్తి

పూర్వకాలంలో కాశీరాజ్యాన్ని బ్రహ్మదత్తుడు అనే రాజు పాలిస్తూఉండేవాడు. ఈతనికి భూసురులపై భక్తిమెండు. వారు ఏమని చెప్పినా శిరసావహించేవాడు. దానికితోడు భూత ప్రేత పిశాచాలంటే యీతనికి భయం ఎక్కువ. ఈ అవకాశాన్ని వినియోగించుకునేటందుకు పురోహితులు అనేకమైన దానధర్మాలను, యజ్ఞయాగాదులను శాంతులనూ అవసరం లేకపోయినా జరిపించి తద్వారా వారు లాభంపొందేవారు. రాత్రివేళలందు కాకులు అరచినా, విచిత్రస్వప్నాలు వచ్చినా, తోకచుక్క భూమిమీద పడినా రాజుచేత అనేకమైన యజ్ఞయాగాదులను చేయించేవారు. ఆలా వెచ్చింపబడిన ద్రవ్యమంతా కొందరు స్వార్థపరుల చేతుల్లోనే పడేది. ఈ విధంగా రాజుగారి ఖజానాలో డబ్బంతా ఖాళీఅయ్యే పరిస్థితికికూడా వచ్చింది. అమాయకుడైన భూపతి తానుచేసేదంతా సత్కార్యాలకే వినియోగింపబడుతున్నదనీ, తన ప్రజల యోగక్షేమాలకే తాను పాటుబడుతున్నాననీ భావించేవాడు.

ఒకనాటి నిశిరాత్రి నగరులో ఎనిమిదరకాల వింతశబ్దాలు వినిపించేయి. వాటిని వినేసరికి రాజు హడలిపోయాడు. వెంటనే పురోహితులను రప్పించి సంగతంతా చెప్పి కర్తవ్యం ఏమిటన్నాడు.

"మహారాజా ? ఈ శబ్దాలు రాచకుటుంబానికే కాక నగరవాసులందరికీ అత్యంత అశుభదాయకాలు. బృహత్తరబాదరామాయణ మహాతంత్రాంగంలో దీనికి చేయవలసిన శాంతి వివరంగా విశదీకరించబడింది. యిందుకు అగ్నిష్టోమయజ్ఞాన్ని చేయాలి నూరుమంది ఆచార్యులు, వేయిమంది పూజారులు, రప్పించబడాలి. పదివేల పశువులను బలియివ్వాలి. నూరువేల బ్రాహ్మణులకు పంచభక్ష్యపరమాన్నాలతో షడ్రసోపేతంగా సంతర్పణ సంతృప్తికరంగా జరిపించాలి. యిదే చేయవలసినశాంతి" అని పురోహితులు వివరించేరు. రాజు అంగీకరించి అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ వెంటనే చేయించమని మంత్రికి ఆజ్ఞాపించేడు.

ఏర్పాట్లన్నీ చురుకుగా సాగుతున్నాయి. నెయ్యి కొరకు ఒక పెద్దచెరువు తవ్వబడింది. యజ్ఞానికి పదివేల పశువులు సిద్ధంచేయబడ్డాయి.

ఈ సంగతంతా నగరానికి ఆవల ఒక వనంలో నివశిస్తున్న భిక్షువు తెలుసుకుని "ఔరా ! రాజు ఎంతటిక్రూరత్వానికి పాల్పడుతున్నాడు. ? నిర్దాక్షిణ్యంగా పదివేలపశువులను బలితీసుకుంటున్నాడు. ఈ రాజుకు గుణపాఠంనేర్పి జంతుబలిని ఆపించాలనే" సంకల్పంతో ఆస్థానంలోనికి వెళ్ళి రాజును సందర్శించేడు.

"ఆపురాజా ! ఆపు ! ఈ జీవహింసను ఆపు. యిప్పటికే మితిమీరిన జంతుబలిని అమలు జరిపేవు. యిప్పుడు పదివేలజంతువులను బలిగొంటున్నావు. ఈ పాపమంతా నీకు తగలకతప్పదు" అని బోధించేడు

"అదేమిటి స్వామీ ? యిదంతా నా స్వార్థానికీ, నా పుణ్యానికీ కాదుగదా! యిదంతా ప్రజాక్షేమానికీ నగరక్షేమానికేగదా ? " అని వినయంతో విన్నవించుకున్నాడు.

"ఎంత అమాయకుడివిరాజా ! నీవు చేసేది ఎవరికోసమైనా అదినీపేర చేయించబడుతున్నది కావున దాని ప్రతిఫలం నీకేచెందుతుంది. నీ ఆస్థానంలోని పురోహితుల మాటలను నమ్మి వారిమాటనే చెల్లిస్తున్నావు. యిప్పటికైనా మించిపోయిందిలేదు. యీ ఆఘాయిత్యాన్ని ఆపు " అని బోధించేడు.

"స్వామీ! ద్విజులమాటలు పొల్లులు కావుకదా! ఒకనాటిరాత్రి ఎనిమిది భయంకరమైన శబ్దాలు విని

పించేయి. వాటి శాంతికే యీ యజ్ఞాలూ యాగాలూను" అని వివరించేడు.

"నాకు తెలుపు రాజా ఆ వింత కూత అర్థాలు. వాటివల్ల నీకుగాని నీ ప్రజలకుగాని ఏవిధమైన అనర్థాలురావు. ఆ నాటిరాత్రి మొదట నీవు విన్నది గబ్బిలము శబ్దముకదూ ?"

"అవును స్వామీ ! అవును" రాజు బుర్రూపేడు.

ఆ నాడు గబ్బిలములు మీ తోటలోని పండ్లను తింటున్నాయి. కాని తోటమాలి వలతో చెట్లను కప్పివేసినందున అవి చింతిస్తూ "ఎక్కడా దొరకక ఆహారంకొరకు ఎంతో దూరాన్నుంచి యిక్కడకు వచ్చేం. రాజుగారితోటలోకూడా ఆహారం లభించకపోతే యింక మాగతేంకాను" అని విలపించేయి రాజా !

రాజు నిర్ఘాంతపోయాడు.

"రెండవ శబ్దం కాకికూత. మీ హస్తిశాల ద్వారంపై ఒక కాకి గూడు కట్టుకుంది. మావటీవాడు ఆ గూడును పడగొట్టి అందులోని గుడ్లను అవతలపారవైచేడు. తన సంతానాన్ని నాశనంచేసినందుకు ఆ మాతృహృదయం ఆ రాత్రి తెల్లవార్లూ విలపించిందిరాజా !" మూడవది "అవు అరపు. తన బిడ్డకు కడుపు నిండకుండా ఒక్క చుక్కనైనా మిగల్చకుండా పాలను పితుక్కుపోతున్నారని ఆ ఆవు కన్నీరుకారుస్తూ అరచింది." "నాల్గవది కోకిల కంఠం. నన్ను బంధించి నాకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్నిలేకుండా చేశారు. నా కెవరుదిక్కు ?" అని విచారవదనంతో విలపించింది. "అయిదవది హరిణశబ్దం. వింధ్యపర్వతాల్లో ఎంతో స్వేచ్ఛగా నివశించేదాన్ని. ఈ నాడు రాజు చేతిలో బంధీకావలసివచ్చింది." అని ఏడ్చింది. "ఆరవది వానర శబ్దం. నా దోషం ఏమిలేకపోయినా నన్ను బంధించేరు యీ రాజ భటులు. నరులకు మతిపోయినట్టుంది" అని వాపోయింది. "ఏడవది గుఱ్ఱపు సకిలింపు. "నాకు పెట్టే అహారాన్ని సైతం రాజభటుడు దొంగలిస్తున్నాడు. నా కష్టానికి ప్రతిఫలం యివ్వకుండా ఉన్నాడు. ఎంత విశ్వాస హీనుడు రాజు" అని సకిలించింది. రాజా ! "అంతిమ శబ్దం నా గానం. రాజు కేవలం ఆ పాత్రులకే దానం చేస్తున్నాడు. స్వార్థపరులైన పురోహితులు రాజును బాగా ఉపయోగించుకుంటున్నారు. రాజుకు సద్బుద్ధికలుగుగాక ! ధర్మమును అహింసను అవలంబించుగాక ! దుర్జనులనుండి స్వార్థపరుల నుండి రక్షింపబడుగాక" అని పాడేను. "అవే మీరు విన్న శబ్దాలు. యిప్పుడైనా అర్థమైందా రాజా ? నీవు చేస్తున్న పొరపాటు !" అని వివరించేడు.

రాజుకి జ్ఞానోదయం కలిగింది. ఆ బిక్షువుకు సాష్టాంగ దండప్రమాణం ఆచరించి "నన్ను రక్షించేరు స్వామీ ! నాకు జ్ఞానబిక్షను ప్రసాదించేరు. మీ రెవరు ?" అని ప్రశ్నించేడు.

"నన్ను బోధిసత్వుడంటారు" అన్నాడు ఆ బిక్షువు.

"బుద్ధ భగవానుడా ! నన్ను రక్షించు" అని బుద్ధుని పాదాలను కౌగలించుకున్నాడు రాజు.

"లే నాయనా ! పశ్చాత్తాపమే నీ పాపాలకు ప్రాయశ్చిత్తం. జీవహింసనుమాను. నీ శరీరాన్ని నువ్వు ఎంతగా ప్రేమిస్తున్నావో యితరులనుకూడా ఆ విధంగానే ప్రేమించు. అదే నీకు మోక్షసాధనం" అని హితబోధచేసి వెళ్ళిపోయాడు.

ఆ నాటినుంచి రాజు జీవహింసను మాన్పించేడు. ఆస్థానంలోని పురోహితులను తగిన రీతిగా మందలించేడు. తోటలోని చెట్లపై వలలను తీసివేయమని భటులకు ఆజ్ఞాపించేడు. మావటివానిని పిలిపించి శిక్షించేడు. పాలు పితికేవానిని పిలచి దూడకు కావలసిన పాలను వదిలివేయమన్నాడు. కోకిలను, వానరాన్ని, హరిణాన్ని విడిపించేడు.

—(౦)—